సాక్షి విశాఖపట్నం

గురువారం । 22 । జూన్ । 2023



సరికొత్తగా 'సామజవరగమన'

ఆహ్వాన యాత్రలో భాగంగా సామజవరగ మన చిత్ర యూనిట్ బుధవారం నగరం, గాజువాకలో సందడి చేసింది. 8లో



వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు

వైద్య ఆరోగ్య శాఖలో ప్రాంతీయ స్థాయిలో బుధవారం పలు కేటగిరీల్లో 62 మంది బదిలీ అయ్యారు. 8లో



వన్యప్రాణుల ఆరోగ్యంపై దృష్టి

ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపడుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

మత్స్యావతారంలో జగన్నాథుడు



బలభద్ర, సుభద్ర సమేతంగా జగన్నాథుడు

దాబాగార్డెన్స్: జగన్నాథస్వామి రథోత్సవాలు టర్నర్ చౌల్ట్రీలో కనులపండువగా జరుగుతున్నాయి. దశావతారాల్లో భాగంగా జగన్నాథుడు బుధవారం మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. వేకువజామున 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక భగవద్గీత, విష్ణు సహస్ర నామ పారాయణ, లలితా సహస్ర నామపారాయణలు నిర్వహించారు. సాయంత్రం సాయిశ్రీ సినీ సంగీత విభావరి సంస్థ అధినేత ఎం.వి. ఆశామధు భక్తి సంగీత విభావరి, కళాసంగీత నృత్యనికేతన్ రమాసుందరి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. స్వామి గురువారం కూర్మావతారంలో దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

ముందస్తు రిజర్వేషన్‌పై ఆర్టీసీ 10 శాతం రాయితీ

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఏపీఎస్ ఆర్టీసీ దూర ప్రాంత సర్వీసుల్లో రానుపోను టికెట్ ముందుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు టికెట్ చార్జీలో 10 శాతం రాయితీ పొందే సదుపాయం కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ప్రకటనలో పేర్కొన్నారు. www.apsrtconline.in ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని, లేదా ద్వారకా బస్‌స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ ద్వారా కూడా రాను పోను టికెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

కొమ్మాది: జవహర్ నవోదయ విద్యాలయలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం గత ఏప్రిల్ నెలలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. అభ్యర్థులు నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి https://cbscit.in/cbse/2023/nvsresult/Result.aspx లింక్ ద్వారా రిజిస్టర్డ్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసుకుని ఫలితాలు పొందవచ్చని తెలియజేశారు.

25న ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విశాఖ విద్య: యూపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించే ఇంజనీరింగ్ సర్వీసెస్ మెయిన్ పరీక్షకు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇంజనీరింగ్ సర్వీసెస్ మెయిన్ పరీక్షకు జిల్లాలో 73 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. నగరంలోని ఏవీఎన్ కాలేజీలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. యూపీఎస్సీ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూలై 1న వీజేఎఫ్ ఎన్నికలు

సీతంపేట: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు వైజాగ్ జర్నలిస్టు ఫోరం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఐజీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న ఓటర్ల జాబితా పరిశీలన, 23న రిటర్నింగ్ ఆఫీసర్ ఎంపిక, తుది ఓటర్ల జాబితా ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. 24న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, 26, 27 తేదీల్లో నామినేషన్ల స్వీకరించనున్నట్లు తెలిపారు. 28న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. జూలై 1న ఎన్నికల నిర్వహణ, అదే రోజు ఓట్లు లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నట్టు పేర్కొన్నారు.

ఆనంద యోగం



స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న నగర ప్రజలు



కంటైనర్ టెర్మినల్‌పై యోగాసనాలు వేస్తున్న కేంద్ర సహాయమంత్రి మురళీధరన్, ఎంపీ జీవీఎల్



యుద్ధ నౌకపై యోగాసనాలు వేస్తున్న నేవీ సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ఆనందపురం మండలం ఎన్‌జీఆర్‌పురంలో చెరువు గట్టుపై యోగా చేస్తున్న ఉపాధి హామీ పథకం వేతనదారులు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు యోగాసనాలు వేయడంతో సందడి వాతావరణం నెలకొంది. పలు వేదికలపై నిర్వహించిన కార్యక్రమాల్లో కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, ఏయూ ఉపకులపతి ప్రసాదరెడ్డి, జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆసియన్ అథ్లెటిక్స్'కు జ్యోతి

స్ప్రింట్‌లో పసిడి పతకాలు సాధించిన విశాఖ అథ్లెట్



విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు విశాఖ అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ అర్హత సాధించింది. ఇటీవల జరిగిన 62వ నేషనల్ అంతర్రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు సాధించిన పన్నెండు మంది అథ్లెట్లు ఆసియన్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించారు. మరో సారి జాతీయ రికార్డును తిరగరాసిన జ్యోతి స్ప్రింట్‌లో పసిడి పతకాలు సాధించడంతో వంద మీటర్ల హార్డిల్స్‌లో న్యూమీట్ రికార్డును నెలకొల్పింది. ఇదే మీట్ లో జ్యోతి బెస్ట్ అథ్లెట్‌గా నిలవడంతో ఆసియన్ చాంపియన్‌షిప్‌నకు మరింత ఆత్మస్థైర్యంతో దూసుకుపోనుంది. ఈ గేమ్స్‌లో 13.63 సెకన్లతో రికార్డు ఉండగా.. జ్యోతి ఆసియన్ బెస్ట్ అథ్లెట్‌గా మారేందుకు సిద్ధమవుతోంది. ఆసియన్ చాంపియన్‌షిప్ థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జూలై 12న మొదలై 16తో ముగియనుంది.

సత్తా చాటిన ఏపీ అథ్లెట్లు..

భువనేశ్వర్‌లోని కళింగా స్టేడియంలో జరిగిన ఈ మీట్‌లో ఏపీ నుంచి బాలురలో పది మంది, బాలికల్లో 13 మంది పోటీకి నిలిచారు. వారిలో జ్యోతి రెండు స్వర్ణాలను కైవసం చేసుకోగా.. ఒక రజతాన్ని, రెండు కాంస్య పతకాలను ఏపీ అథ్లెట్లు సొంతం చేసుకున్నారు. హెప్టాథ్లాన్ వుమెన్‌లో ఒక కాంస్యాన్ని సొంతం చేసుకోగా.. పలువురు తుది పోరులోనూ నిలిచి టాప్ టెన్ స్టాండింగ్‌లోకి చేరారు. దీంతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ఏపీ వుమెన్ నాలుగో స్థానంలోనూ, మెన్ పదో స్థానంలోనూ మీట్‌కు ముగింపు పలికారు.

హెప్టాథ్లాన్‌లో సౌమ్యమురుగన్..

హెప్టాథ్లాన్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ సౌమ్యమురుగన్ 5,323 పాయింట్లతో నిలిచి ఆసియన్ గేమ్స్‌కు వెళ్లే కాంటిజెంట్‌లో స్థానం కోసం ఎదురుచూస్తోంది. మరో అంశాల మేళవింపుతో కూడిన ఈ హెప్టాథ్లాన్‌లో తనకంటే మెరుగ్గా 5,918 పాయింట్లతో మధ్యప్రదేశ్ అథ్లెట్ ముందుండగా తర్వాత స్థానంలో 5,703 పాయింట్లతో తెలంగాణ అమ్మాయి నందిని నిలిచింది.

మరోసారి రికార్డు తిరగరాద్దామనుకున్నా..

అంతర్రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో భాగంగా వంద మీటర్ల హార్డిల్స్‌లో నా రికార్డును తిరగరాద్దామనే అనుకున్నా. నా టార్గెట్ 12.90 సెకన్లు. అయితే మూడో హార్డిల్ దాటే క్రమంలో తడబడటంతో రిథమ్ కాస్త తగ్గింది. దీంతో 12.92 సెకన్లలో పూర్తి చేసి మరో స్వర్ణాన్ని ఈ మీట్‌లో అందుకున్నాను. అదీ న్యూ మీట్ రికార్డుగా నిలిచింది. మరోసారి ఒకే మీట్‌లో రెండు స్వర్ణాలను సాధించడం ఆనందంగానే ఉంది.

–జ్యోతి, న్యూమీట్ రికార్డ్ హోల్డర్

తీరు మారకపోతే పీడీ యాక్ట్



ప్రమాణం చేస్తున్న రౌడీషీటర్లు



వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

- రౌడీషీటర్లకు సీపీ త్రివిక్రమ్ వర్మ క్లాస్
- నగరంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయి
- ప్రతి చిన్న విషయాన్ని శాంతి భద్రతలతో ముడిపెట్టవద్దని మీడియాకు సూచన

అల్లిపురం: నేరాలకు పాల్పడి నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ హెచ్చరించారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో బుధవారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నిరంతరం నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. దేవుని ఎదుట ప్రమాణం చేసి తాము మంచిగా ఉంటామని, సమాజానికి మంచి చేస్తామని, నగర ప్రశాంతతకు భంగం కలిగించమని రౌడీషీటర్లతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో ఏ కేటగిరీకి చెందిన 283 మంది రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ఉన్నారని వెల్లడించారు. వారందరినీ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని.. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు. ఇప్పటికే ఒకరిపై పీడీ యాక్ట్ ఫైల్ చేసినట్లు చెప్పారు. బెయిల్‌పై బయటకు వచ్చి మరలా నేరానికి పాల్పడితే.. వారి బెయిల్ రద్దు చేసి మళ్లీ జైలుకు పంపిస్తామన్నారు. ప్రతి ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు ఏసీపీ స్థాయిలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. త్వరలో డీసీపీ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేస్తామని, ఈ కమిటీ ద్వారా రౌడీషీటర్లను మరింత దగ్గరగా పర్యవేక్షిస్తామన్నారు. రౌడీ షీటర్లలో మార్పు వస్తే కేసులు తొలగించడమే కాకుండా వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయి

ఇటీవల జరిగిన కిడ్నాప్ వ్యవహారం మినహా నగరంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. రాత్రి సమయాల్లో కారణం లేకుండా బైక్‌లపై సంచరించే వారిని గుర్తించి.. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి వారి నుంచి బైక్‌లు స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తామన్నారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబం కిడ్నాప్ కేసులో మరో ఐదుగురిని అరెస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు. ఎంపీ కుమారుడి నుంచి భీమిలీ సీఐకి ఫోన్ వచ్చిందన్న కథనాలపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి చిన్న విషయాన్ని శాంతి భద్రతలతో ముడిపెట్టవద్దని మీడియాకు సూచించారు. సమావేశంలో డీసీపీలు ఆనందరెడ్డి, విద్యాసాగర్ నాయుడు, క్రైం డీసీపీ జి.నాగన్న, ఏడీసీపీ గంగాధరం, ఏసీపీ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సింహ'గిరి ప్రదక్షిణ'

- వచ్చేనెల 2, 3 తేదీల్లో గిరి, ఆలయ ప్రదక్షిణలు
- లక్షన్నర మందికి పైగా భక్తులు వస్తారని అంచనా
- ఆషాఢ పౌర్ణమి రోజున నిరంతర అన్నప్రసాదం
- కలెక్టర్ మల్లికార్జున సూచనలు



విభాగాధిపతులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్‌వర్మ

సాక్షి, విశాఖపట్నం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని వచ్చే నెల 2, 3 తేదీల్లో సింహగిరి, ఆలయ ప్రదక్షిణలను సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమన్వయ సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిప్రదక్షిణ రోజున 70 వేల మందికి పైగా భక్తులు, ఆషాఢ పౌర్ణమి రోజున లక్షకు పైబలుకు భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 2 లక్షల మందికి సరిపడా ఏర్పాట్లు చేయాలని సూచించారు. 3న ఉదయం నుంచి నిరంతరం స్వామివారి అన్న ప్రసాదం భక్తులకు అందించాలని ఆదేశించారు. కొండ చుట్టూ షామియానాలతో ఏర్పాట్లు చేసి.. ప్రతి స్టాల్‌లోనూ టేబుల్స్, కుర్చీలు, మంచినీటి డ్రమ్ములు, మజ్జిగ, తాగునీటి ప్యాకెట్స్, సౌండ్ సిస్టం, లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాల వద్ద ఒక ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తని షిఫ్ట్ పద్ధతిలో ఉంచాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గిరి ప్రదక్షిణ జరిగే మార్గంలో ప్రైవేట్, ప్రభుత్వ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుధ్యం, టాయిలెట్స్ నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. రాత్రి సమయంలో గిరి ప్రదక్షిణ మార్గంలో తగినంత లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించే స్వచ్ఛంద సంస్థలు ముందుగా దేవస్థానం అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూలైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. దేవస్థానం అధికారులు తమ సిబ్బందిని ప్రతిచోట కార్యక్రమానికి ఆరు గంటల ముందుగానే ఉండేటట్టు ప్రణాళిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తగిన సంఖ్యలో బస్సులు అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులను ఆయన ఆదేశించారు. ఈపీడీసీఎల్ అధికారులు గిరి ప్రదక్షిణ జరిగే మార్గంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు.

సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో భ్రమరాంబ మాట్లాడుతూ ఈ ఏడాది జరిగే వార్షిక ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. దర్శనానంతరం భక్తులను ఉచితంగా కొండపైకి, కిందకు దించేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, దేవాదాయశాఖ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆ రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణకు పోలీసులతో పాటు ఎస్డీఆర్‌ఎఫ్, మెరైన్ పోలీసులు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆ రెండు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. పాత గోశాల, గోపాలపట్నం నుంచి వచ్చే వాహనాలకు పాత గోశాల తరువాత అనుమతి లేదని తెలిపారు. కొంత్యాం నుంచి వచ్చే వాహనాలకు అడవివరం వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. అడవివరం నుంచి తొలి పావంచా చేరే భక్తులు కోనేరు మీదుగా కలశం జంక్షన్ చేరి అక్కడి నుంచి రావాలని సూచించారు. హనుమంతవాక, జోడుగుళ్లపాలెం దారిలో ఇరుకు మార్గం కారణంగా దాతలు స్టాళ్ల ఏర్పాటు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. జోడుగుళ్లపాలెం వద్ద సముద్ర అలల ఉధృతి అధికంగా ఉన్న కారణంగా స్నానాలకు అనుమతి లేదని సీపీ స్పష్టం చేశారు. లుంబిని పార్క్ దగ్గర స్నానాలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రెండు రోజులు ప్రదక్షిణ మార్గంలోని మద్యం షాపులు, బార్లు మూసివేయనున్నట్టు ప్రకటించారు.

నాలుగేళ్ల డిగ్రీలో విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛ

ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



సదస్సులో మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

ఏయూ క్యాంపస్: నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సుల్లో విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నాలుగు సంవత్సరాల డిగ్రీ విద్యా విధానంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీసీ కూడా ప్రస్తుతం సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానం అమలు చేయాలని భావిస్తోందన్నారు. విద్యార్థి డిగ్రీ కోర్సులో చేరిన సమయంలో మేజర్ సబ్జెక్టును మాత్రమే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండో సెమిస్టర్‌లో విద్యార్థి ఆసక్తికి అనుగుణంగా మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే స్వేచ్ఛ, వెసులుబాటు ఉంటాయని చెప్పారు. విద్యార్థికి ప్రాధాన్యం కల్పిస్తూ రాష్ట్రంలో విద్యా విధానం ఉంటుందన్నారు. 26 ఏళ్ల కిందట రాష్ట్రంలో సింగిల్ మేజర్ విధానం అమల్లో ఉండేదని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థిని నైపుణ్యాలతో సుసంపన్నం చేసి మానవ వనరులుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భావిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశామన్నారు. నాలుగేళ్ల డిగ్రీ విద్యా విధానంనిపై కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు అపోహలు వీడాలని సూచించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో సూచించిన మార్పులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యథాతథంగా అమలు చేసిన తీరును వివరించారు. విద్య ప్రతి కుటుంబానికి వెలుగునిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, సీడీసీ డీన్ ఆచార్య సత్యనారాయణరెడ్డి, వర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పూర్ణానంద స్వామీజీకి జూలై 5 వరకు రిమాండ్

విశాఖ లీగల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమ నిర్వాహకుడు పూర్ణానంద స్వామీజీని నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం రాత్రి 9.30 గంటలకు పోక్సో కేసుల ప్రత్యేక పోలీసులు హాజరుపరిచారు. అతనికి వచ్చే నెల ఐదో తేదీ వరకు న్యాయమూర్తి జె.పద్మావతి రిమాండ్ విధించారు. పూర్ణానంద తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఓ బాలిక ఆరోపణ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై దిశ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమిక విచారణ అనంతరం స్వామీజీ లైంగిక దాడికి పాల్పడినట్లు నిర్ధారించారు. ఆయన్ని అరెస్ట్ చేసి ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ కోర్టులో హాజరపరిచారు. వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి కేసు తదుపరి విచారణ నిమిత్తం జూలై ఐదో తేదీకి వాయిదా వేశారు. స్వామీజీని పోలీసులు విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు.

నేడు, రేపు పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి సహకరించాలని కోరారు. ఈ నెల 22న ఖరగ్‌పూర్–విల్లుపురం(22603) ఎక్స్‌ప్రెస్, షాలిమార్–హైదరాబాద్(18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–డిఘా(22874) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–మంగుళూరు (22851) వివేక్ ఎక్స్‌ప్రెస్, డిబ్రూఘడ్–సికింద్రాబాద్ (07047) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. ఈ నెల 23న డిఘా–విశాఖపట్నం (22873) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం–హౌరా(22832) ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

హౌరా మెయిల్ రీ షెడ్యూల్

బుధవారం రాత్రి 7.20 గంటలకు చెన్నైలో బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్– హౌరా (12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 11 గంటలకు బయలుదేరింది.

యోగాతో ఆరోగ్య భారత్

కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్



గాదిరాజు ప్యాలెస్‌లో కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. కేంద్ర పోర్టులు షిప్పింగ్, జల రవాణా, ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆదేశాలను అనుసరించి విశాఖ కంటైనర్ టెర్మినల్–2, పోర్టు స్టేడియంలో ఈ వేడుకలు నిర్వహించారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 'యోగా ఫర్ వసుధైక కుటుంబం' అనే థీమ్‌తో యోగా దినోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో వివిధ సభ్య దేశాలతో కలిసి 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం భారతీయులందరికీ గర్వకారణమన్నారు. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ పోర్టు ఉద్యోగులు ఇకపై ప్రతి వారం యోగానభ్యసించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువుల సూచనలతో పోర్టు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సీఐఎస్‌ఎఫ్, కంటైనర్ టెర్మినల్ సిబ్బంది ఆసనాలు వేశారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి, కార్యదర్శి టి.వేణుగోపాల్, విభాగాధిపతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యోగాపై పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఏయూక్యాంపస్/సీతంపేట: యోగాతో దంత సమస్యలను దూరం చేసే విధానంపై నగరానికి చెందిన దంత వైద్య దంపతులు డాక్టర్ ఎన్.ఎస్.గౌతం, డాక్టర్ ఎస్.రాధిక గౌతం పుస్తకం రచించారు. ఏయూ యోగా కేంద్రం నేచురోపతి వైద్యులు డాక్టర్ ఆర్.తులసీరావుతో సంయుక్తంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. అలాగే ప్రముఖ యోగా శిక్షకురాలు డాక్టర్ టి.వి.ఆర్‌చంద్ర యోగా థెరపీపై పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాలను స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ జి.హరి వెంకట కుమారి ఆవిష్కరించారు. జేసీ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పాల్గొన్నారు.

- 'యోగా అండ్ డెంటల్ హైజీన్' పుస్తకంలో యోగాపై అవగాహన, యోగాతత్వం, యోగా విభాగాలు, ప్రాణాయామం, దంత ఆరోగ్యం, యోగా సహకారంతో దంత ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలు వివరించారు. చిన్నారుల్లో దంత సంబంధ వ్యాధుల నివారణకు యోగా ఏ విధంగా ఉపయుక్తంగా నిలుస్తుందో తెలిపారు.
- 'యోగా థెరపీ ఫర్ హైపర్ టెన్షన్' పుస్తకంలో రక్తపోటు, వెన్నునొప్పి నివారణకు యోగా చికిత్స విధానాలను విపులీకరించారు. ఆరోగ్య సమస్యలకు పరిష్కారంగా యోగా నిలుస్తున్న విధానాన్ని వివరించారు.

ఉపాధ్యాయులకు 'యోగా' శిక్షణనిస్తాం



ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానంలో ఆసనాలు వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: ప్రపంచ దేశాలకు భారత్‌దేశం అందించిన విలువైన సంపదగా యోగా నిలుస్తుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానంలో రోటరీ క్లబ్స్ విశాఖపట్నం, ఏయూ యోగా కేంద్రం, సమగ్ర శిక్షా అభియాన్ సంయుక్తంగా బుధవారం దివ్యాంగ విద్యార్థులతో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా యోగాకు విశిష్ట ప్రాచుర్యం లభిస్తోందని, చిన్నారులకు యోగా విద్యను చేరువ చేయాలని సూచించారు. త్వరలో ఏయూ ఆధ్వర్యంలో పాఠశాలల ఉపాధ్యాయులకు యోగా శిక్షణ అందిస్తామన్నారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ మన ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. విభిన్న ప్రతిభావంతులను భాగస్వాములను చేస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం మంచి పరిణామమన్నారు. సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రాచీనకాలం నుంచి యోగా భారతీయులకు సుపరిచితమన్నారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులతో కలసి యోగా సాధన చేశారు. డీఈవో ఎల్.చంద్రకళ, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, రొటేరియన్స్ మల్లిక, పి.శ్రీధర్, విద్యాసాగర్, యోగా విభాగం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్ భానుకుమార్, విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ చిట్టూరి శ్రావణి, యోగా విభాగం సిబ్బంది పాల్గొన్నారు. సుమారు గంట సమయం దివ్యాంగ చిన్నారులకు యోగాపై అవగాహన కల్పిస్తూ.. వారితో యోగాసనాలు వేయించారు.

యోగా జీవితంలో భాగం కావాలి

సీతంపేట: యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి ఆయన యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందడానికి యోగా మంచి సాధనమన్నారు. ఈ సందర్భంగా వివిధ యోగా సంస్థల ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, విద్యార్థులు ఆసనాలు వేశారు. అనంతరం ఆయుష్ శాఖ అధికారులను సన్మానించారు. ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఆయుష్ శాఖ సీనియర్ వైద్యాధికారి వెంకటరావు, పతంజలి ఆర్ట్ ఆఫ్ లివింగ్, నేచర్ క్యూర్, పుష్పాంజలి, ఆంధ్రా యూనివర్సిటీ యోగా విలేజ్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..

విశాఖ లీగల్: విశాఖ జిల్లా కోర్టులో అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఆరోగ్య భారత్‌ను నిర్మించడమే లక్ష్యంగా అందరూ యోగా సాధన చేయాలన్నారు. న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



గాదిరాజు ప్యాలెస్‌లో యోగాసనాలు వేయిస్తున్న శిక్షకుడు రమేష్

గాదిరాజు ప్యాలెస్‌లో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–11లోని గాదిరాజు ప్యాలెస్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. ఓం ఉచిత యోగా సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున నగరవాసులు పాల్గొన్నారు. వివిధ రకాల ఆసనాలను వేయడంతో పాటు సూర్యనమస్కారాలు, యోగాసనాలతో కూడిన నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కేంద్ర విదేశీ వ్యవహారాలు, పార్లమెంట్ వ్యవహారాల మంత్రి మురళీధరన్, ఏయూ వీసీ ఆచార్య వీపీజీడీ ప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత భారతదేశానికి దక్కుతుందని అతిథులు అన్నారు. అనంతరం అతిథులను నిర్వాహకులు సత్కరించారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఓం యోగా సంస్థల వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్, భానుకుమార్, శాంతారామ్, యోగారాజు, గాదిరాజు ప్యాలెస్ డైరెక్టర్ వర్మ గాదిరాజు తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు

విశాఖ లీగల్: ఖాతాలో తగినన్ని నిధులు లేకపోయినా చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ నగరంలోని నాలుగో ప్రత్యేక మేజిస్ట్రేట్ ఎల్ల అప్పారావు బుధవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదుదారుని తరపు న్యాయవాది పెద్దింటి బాబూరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిర్యాది నారాయణరావు పీఎం పాలెం నివాసి. ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. జనార్దనరావు తోటగరువు దగ్గర నివసిస్తున్నారు. వృత్తిరీత్యా వ్యాపారస్తుడు. జనార్దనరావు తన అవసరాల కోసం 2018 సెప్టెంబర్‌లో నారాయణరావు వద్ద రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నారు. రుణం తీర్చే నిమిత్తం 2019 జూన్‌లో జనార్దనరావు ఓ చెక్కు జారీ చేశారు. ఆ చెక్కుని నారాయణరావు తన ఖాతాలో జమ చేయగా తగినన్ని నిధులు లేని కారణంగా నిరాదరణకు గురైంది. దీంతో నారాయణరావు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేసినా ఫలితం లేకపోయింది. అనంతరం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో జనార్దనరావుకు జైలు శిక్ష విధించారు.

ఘనంగా హెచ్‌ఎస్‌ఎల్ వ్యవస్థాపక దినోత్సవం



వేడుకలు ప్రారంభిస్తున్న సీఎండీ హేమంత్ ఖత్రీ

సీతంపేట(విశాఖ ఉత్తర): హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్(హెచ్‌ఎస్‌ఎల్) 83వ వ్యవస్థాపక దినోత్సవంతోపాటు అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. 82 ఏళ్ల అంకితభావం, సంస్థ అభివృద్ధి, దేశానికి సేవ చేయడంలో సాధించిన విషయాలను గుర్తు చేశారు. కంపెనీ–పనితీరు 3ఆర్‌పై దృష్టి సారించడం ద్వారా వృద్ధిబాటలో పయనించాలని కోరారు. సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులు, సిబ్బంది పాత్ర ఎంతో ఉందన్నారు. మెరుగైన భవిష్యత్ కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ముందుగా సేథ్ వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం యోగా డే సందర్భంగా సంస్థ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా ప్రాముఖ్యాన్ని ఉద్యోగులకు సీఎండీ వివరించారు.

సరికొత్తగా 'సామజవరగమన'



మాట్లాడుతున్న హీరో శ్రీవిష్ణు

డాబాగార్డెన్స్/గాజువాక: సామజవరగమన చిత్ర యూనిట్ బుధవారం నగరం, గాజువాకలో సందడి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆహ్వాన యాత్రలో భాగంగా హీరో శ్రీవిష్ణు, హీరోయిన్ రెబా మోనికా జాన్, దర్శకుడు రామ్ అబ్బరాజు తదితరులు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా హీరో శ్రీవిష్ణు మీడియాతో మాట్లాడుతూ ఇది పూర్తి కుటుంబ కథా చిత్రమని, ప్రేక్షకులను అలరించడంతో పాటు యువతకు మంచి సందేశాన్నిస్తుందన్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ సరికొత్తగా ఉంటుందని, అందరూ థియేటర్లలో చూడాలని కోరారు. అభిరుచి గల ప్రేక్షకులు విశాఖలో ఉన్నారని, విశాఖ వాసిగా ఎంతో సంతోషంగా ఉందన్నారు. చిత్ర మాటల రచయిత భాను కూడా విశాఖ వాసేనని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ హాస్య మూవీస్ బ్యానర్‌పై ఏకే ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 29న విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గోపి సుందర్ మంచి సంగీతం అందించారన్నారు. హీరోయిన్ రెబా మోనికా మాట్లాడుతూ చిత్ర కథలో తన పాత్రకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. గాజువాకలో చిత్ర యూనిట్‌కు స్వాగతం పలికిన బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు, గణేష్ తదితరులు ఈ సందర్భంగా యూనిట్‌ను శాలువాలతో సత్కరించారు. సంగీత దర్శకుడు గోపి సుందర్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు



మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖలో ప్రాంతీయ స్థాయిలో బుధవారం పలువురికి బదిలీలు జరిగాయి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు కేటగిరీల్లో సీనియర్ అసిస్టెంట్లు 62 మందికి బదిలీలు చేశారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం జిల్లా, ఏఎస్ఆర్ జిల్లాల్లో సీనియర్ అసిస్టెంట్లకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పి.ఉమాసుందరి ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ బదిలీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒక ఉద్యోగ సంఘం నాయకులు కోర్టు ఆర్డర్ తీసుకొచ్చి బదిలీలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పి.ఉమాసుందరి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్‌కు అందజేశారు. అయితే అప్పటికే బదిలీల వ్యవహారం పూర్తి అయిపోవడంతో తాము ఏమీ చేయలేమని ఉద్యోగ సంఘం నాయకులకు అధికారులు తెలియజేశారు. దీంతో ఉద్యోగ సంఘం నాయకులు అక్కడ నిరశన తెలిపారు.

- వైద్య ఆరోగ్యశాఖలో ఉమ్మడి విశాఖ జిల్లాలో కూడా ఉద్యోగుల బదిలీలు బుధవారం జరిగాయి. విశాఖపట్నం, అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల్లో పలు కేటగిరీల్లో మొత్తం 53 మందిని బదిలీ చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 11 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఏడుగురు ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లు, 15 మంది అటెండర్లు, ఐదుగురు స్వీపర్లు, ఒక టైపిస్టుకు బదిలీ చేశారు.

ప్రేమికురాలిపై చేయి చేసుకున్న ప్రేమికుడు

- దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసిన యువతి
- అతనితో క్షమాపణ చెప్పించిన పోలీసులు

దొండపర్తి: అనుమానంతో ప్రేమించిన యువతిపై ప్రేమికుడు చేయి చేసుకొని గాయపరిచాడు. బాధిత యువతి వెంటనే దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. దిశ టీం అప్రమత్తమై.. క్షణాల్లో ఆమె ఉన్న లొకేషన్‌కు చేరుకుంది. ఆమెకు ధైర్యం చెప్పి క్షేమంగా ఇంటి వద్ద డ్రాప్ చేసింది. ఈ ఘటన ఎంవీపీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మంగళవారం రాత్రి లెనిన్ అనే యువకుడు తన ప్రియురాలితో కలిసి ఆర్‌కే బీచ్‌కు వెళ్లాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసింది. యువతిని దూషించడంతో పాటు కొట్టడంతో ఆమెకు గాయమైంది. భయాందోళనకు గురైన యువతి దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. వెంటనే దిశ పోలీసులు బాధితురాలు ఉన్న లొకేషన్‌కు చేరుకున్నారు. ఆర్.కె.బీచ్‌లో ఒంటరిగా ఏడుస్తూ ఉన్న యువతికి ధైర్యం చెప్పారు. ఆమెను ఇంటి వద్ద క్షేమంగా డ్రాప్ చేశారు. ఆమెపై చేయి చేసుకున్న లెనిన్‌ను గుర్తించి.. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అతనితో ఆమెకు క్షమాపణలు చెప్పించారు. దిశకు కాల్ చేసిన వెంటనే స్పందించిన పోలీసులకు బాధిత యువతి కృతజ్ఞతలు తెలియజేసింది.

మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పవన్ వ్యాఖ్యలు

- ముస్లింలకు తక్షణం క్షమాపణ చెప్పాలి
- లేదంటే వారాహి యాత్రను అడ్డుకుంటాం..
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ముస్లిం నేత, కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్



మీడియాతో మాట్లాడుతున్న మహమ్మద్ సాధిక్

సాక్షి, విశాఖపట్నం: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు చేస్తున్నారని.. ఇది ఏమాత్రం సరికాదని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ముస్లిం నేత, కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ అన్నారు. ముస్లింల మనోభావాలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తక్షణం వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని.. లేదంటే వారాహి యాత్రను అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. భారతదేశం బహు మతాలు, భిన్న సంస్కృతులు, భాషలకు నిలయమని, ప్రజాస్వామ్య–లౌకిక దేశమని పవన్ మరిచిపోయి మాట్లాడుతున్నారన్నారు. మతపర దేశమైన పాకిస్థాన్‌తో మన దేశాన్ని పోల్చడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులంతా కలిసి రాష్ట్రంలో ప్రశాంతంగా.. ఆనందంగా జీవిస్తున్న తరుణంలో ముస్లిం సమాజంపై పవన్ కల్యాణ్ మాట్లాడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు మూడు కలిసి ముస్లిం, హిందువుల మధ్య మతాల పేరిట గొడవలు సృష్టించాలనుకున్నా.. సాధ్యం కాదని పేర్కొన్నారు. బీజేపీ లాంటి మతతత్వ పార్టీ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మతాల పేరిట గొడవలు సృష్టించి లాభపడిందే గానీ.. ఏపీలో మాత్రం చతికిలపడిందని గుర్తుచేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు షబ్నమ్ అఫ్రోజ్ మాట్లాడుతూ మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్‌ను ప్రభుత్వమే ముందుస్తుగా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ సభ్యులు మహమ్మద్ ముసి ఉల్లా ఖాన్, జిల్లా వక్ఫ్ బోర్డు మెంబెర్ బుఖారి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


జూలో వన్యప్రాణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



యానిమల్ కీపర్‌తో మాట్లాడుతున్న వెటర్నరీ అధికారులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం జంతు ఆరోగ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా జూ క్యూరేటర్ నందనీ సలారియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్కు విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ నవీన్‌కుమార్, విశాఖ రీజియన్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కరుణాకరరావు, ఏఆర్‌సీ వెటర్నరీ వైద్యుడు డాక్టర్ నర్సింహరావు, ఇందిరాగాంధీ జూ డాక్టర్ ఫణీంద్ర తదితర 10 మందితో కూడిన కమిటీ సభ్యులతో కలసి జూలో అన్ని ఎన్‌క్లోజర్లను సందర్శించారు. వాటిలో జంతువులు, పక్షులను పరిశీలించి, వాటికి అందిస్తున్న ఆహారం, సేవల గురించి యానిమల్ కీపర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జూపార్కులో సమావేశం నిర్వహించి, ప్రస్తుతం జూలో వన్యప్రాణులకు అందుతున్న వైద్యం, మెరుగుపరచడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ జూలో జంతువులు, పక్షుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని చెప్పారు. వాటికి మెరుగైన వైద్యం అందించేందుకు గానూ జంతు ఆరోగ్య కమిటీతో సమావేశం నిర్వహించామన్నారు. కాలానుగుణంగా నిర్వహించే ఇలాంటి సమావేశాల వల్ల జంతు సంరక్షణ చర్యలు పటిష్టంగా చేపట్టగలమన్నారు. అనంతరం డాక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ జూలో వన్యప్రాణులకు అందించాల్సిన వైద్య సేవలు, పౌష్టికాహారం గురించి వివరించారు. కమిటీ సభ్యులు జేఏపీ డాక్టర్ సీహెచ్ పురుషోత్తం, డిప్యూటీ సీఎఫ్ జి.మంగమ్మ, ఆర్ఏడీడీఎల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.హిమజ, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ డి.శ్రీకళ, జూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్ణానంద స్వామీజీ లీలలపై ఆందోళన



ఆందోళన చేస్తున్న పలు సంఘాల సభ్యులు

మద్దిలపాలెం: ఆశ్రమం ముసుగులో కీచక పనులకు పాల్పడిన పూర్ణానంద స్వామీజీపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశ్రమం వద్ద బుధవారం మహిళా, యువజన, విద్యార్థి దళిత హక్కుల సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధి అత్తిలి విమల, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రాంబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి జి.రాంబాబు మాట్లాడుతూ జ్ఞానానంద ఆశ్రమంలో ఓ బాలికను పూర్ణానంద స్వామీజీ రెండేళ్లుగా చిత్రహింసలకు గురి చేశాడన్నారు. గతంలో కూడా ఇలాంటి తరహా సంఘటన చోటు చేసుకున్నా సరైన చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ పునరావృత్తం అయిందన్నారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ జరిపి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని, పరిస్థితిని చక్కదిద్దారు.